కొబ్బరికాయలు కొడుతున్న జల్లపల్లి ఆబాది వాసులు

పోచారం గెలుపుతో మొక్కులు తీర్చుకున్న గిరిజనులు

కోటగిరి, డిసెంబర్ 5: బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడంతో మండలంలోని జల్లాపల్లి ఆబాది గిరిజనులు మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు. సేవాలాల్, జగదాంబ మాత ఆలయంలో సర్పంచ్ వివేక్ 151 కొబ్బరికాయలు కొట్టారు. సేవాలాల్ ఆలయ నిర్మాణానికి పోచారం రూ. 43 లక్షలు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, బోజారం, రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

రుద్రూర్, డిసెంబర్ 5: పోచారం శ్రీనివాసరెడ్డి గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, కార్యదర్శి బాలరాజు మంగళవారం ఒక ప్రకనటలో ధన్యవాదాలు తెలిపారు. పోచారానికి మెజారిటీ అందించడంలో రుద్రూర్ మండలం 3వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. పోచారం గెలుపే లక్ష్యంగా కష్టపడి గడప గడపకూ ప్రచారం చేసిన కార్యకర్తలు, నాయకులు కృతజ్ఞతలు చెప్పారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 5 : మండలంలోని దివ్యాంగులకు మంగళవారం 50 శాతం రాయితీపై బస్‌పాస్‌లను అందజేసినట్లు ఏపీఎం రవీందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల పునరావాస కేంద్రం సీసీ, అన్ని క్లస్టర్ల సీసీలు, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మంటలు ఆర్పుతున్న స్థానికులు

ఇందల్వాయి, డిసెంబర్ 5 : మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పులి సాయిలు చెందిన ఇల్లు మంగళవారం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు ఆర్ఐ నరేశ్ తెలిపారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆర్పివేశారు. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. రూ. 60 వేల నగదు, 5 తులాల బంగారం అగ్నికి ఆహుతి అయినట్లు వివరించారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద నష్టపరిహారం, బియ్యం అందజేసినట్లు తెలిపారు.

అభివృద్ధిలో వర్ని మండలం ముందంజ: ఎంపీపీ

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

వర్ని, డిసెంబర్ 5: అభివృద్ధిలో వర్ని మండలం నియోజకవర్గంలోనే ముందంజలో ఉన్నదని ఎంపీపీ మేక శ్రీలక్ష్మీ వీర్రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో పలుచోట్ల మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీలు ఉన్నట్లు పలువురు ఎంపీటీసీలు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే మరమ్మతులు చేయించి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ పాలకులకు ఏఈ సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ బర్దావల్ హరిదాస్, వైస్ ఎంపీపీ దండ్ల బాలరాజు, ఎంపీడీవో బషీరుద్దీన్, కో-ఆప్షన్ సభ్యుడు కరీం, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు

నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో వరి నాట్లు ముమ్మరం చేశారు. ఎన్నికల సందడి, ఓట్ల పండుగ ముగియడంతో రైతులు నాట్ల పండుగను ప్రారంభించారు. యాసంగి సాగుపై దృష్టి సారించారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉండడంతో రైతులు ఉత్సాహంగా సాగుపనులు చేపట్టారు. ప్రస్తుతం బోరుబావుల ఆధారంగా నాట్లు ప్రారంభించగా, ఉమ్మడి కోటగిరి మండలంలో రైతులు, కూలీలు బీజీబీజీగా కనిపిస్తున్నారు.

-కోటగిరి, డిసెంబర్ 5

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

సోనాబాయికి బీమా చెక్కును అందిస్తున్న బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

బోధన్, డిసెంబర్ 5: బోధన్ పట్టణం ఆచన్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు భీమ్‌రావు ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబానికి 'బీఆర్ఎస్ సభ్యత్వ బీమా' కింద రూ.2 లక్షల చెక్కును బీమా కంపెనీ మంజూరుచేసింది. ఈ చెక్కును భీమ్‌రావు సతీమణి సోనాబాయికి బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అందించారు. మంగళవారం బోధన్‌లో జరిగిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో ఈ చెక్కును అందించిన ఎమ్మెల్యే షకీల్ మాట్లాడుతూ.. ప్రతి సభ్యుడికి బీమా చేయించిన పార్టీ బీఆర్ఎస్ పార్టీనేనని అన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 5: ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం హరిత తెలిపారు.జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ గ్రామంలో ఎస్‌జీఎఫ్ నిర్వహించిన అండర్-14 విభాగంలో బాలురు, అండర్-17 విభాగంలో బాలికలు ప్రథమ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లాల్లో ఈ నెల 8 నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు, పీఈటీ మధును పాఠశాల సిబ్బంది, సర్పంచ్ సుమలత అభినందిచారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

ఆర్మూర్ మండలంలోని మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో మంగళవారం కుర్చీలను వితరణ చేశారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పట్వారి తులసీ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులకు సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం హరిత, క్లబ్ సభ్యులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు నందిపేట్ విద్యార్థులు

జూడో పోటీలకు ఎంపికైన నందిపేట్ నియో లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు

నందిపేట్, డిసెంబర్ 5 : మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు జి.మనిదీప్, సిద్ధునాయక్, ధీరజ్, మేఘనాథ్, మణికంఠ, ఆదర్శగౌడ్, అబ్దుల్ గఫర్, శ్రీకర్ ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లాలో ఈ నెల 5, 6వ తేదీల్లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని పాఠశాల నిర్వాహకులు తెలిపారు.

బాస్కెట్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆర్మూర్‌టౌన్,డిసెంబర్5: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో పెర్కిట్‌లో ఉన్న సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు జక్కుల అద్రిజ, వేదాంశ్ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ (అండర్ -14) పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సుమలత మంగళవారం తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ కిరణ్ పాల్గొన్నారు.

టీయూలో పీజీ సీట్లను భర్తీ చేయాలి

డిచ్‌పల్లి, డిసెంబర్ 5 : టీయూలో ఖాళీగా ఉన్న 200 పీజీ సీట్లను భర్తీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేసి రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023-24 విద్యా సంవత్సరానికి గాను పీజీ అన్ని కోర్సుల్లో కలిపి 200 సీట్లు మిగిలిపోయాయని తెలిపారు. ఎక్కువగా సీట్లు ఖాళీగా ఉన్న కోర్సులను ఎత్తేసే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లను భర్తీ చేసి గ్రామీణ పేద విద్యార్థులకు అవకాశాలు కల్పించాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో భగవద్గీత కంఠస్థ పోటీలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 5 : గీత జయంతిని పురస్కరించుకొని తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ అధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలను జిల్లాల వారీగా నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ సీతారామచంద్రమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6,7 తరగతులు, 8,9 తరగతులకు వేర్వేరు విభాగాలుగా భగవద్గీతలోని 3వ అధ్యాయం కర్మయోగం 30 శ్లోకాలపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అదే విధంగా 18 ఏండ్లలోపు వారికి సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాలపై, 18 ఏండ్లు పై బడిన వారికి రెండు విభాగాలుగా పోటీలు ఉంటాయని వివరించారు. ఈ నెల 10న కామారెడ్డి సరస్వతీ విద్యామందిర్, 12న నిజామాబాద్ గీతాభవనంలో ఉదయం 10 నుంచి పోటీలు ప్రారంభిస్తామని వెల్లడించారు. వివరాలకు 9490997596 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

'తెలుగు భాషకు ఘంటసాల స్వర వెలుగులు'

గాయకులను సన్మానిస్తున్న తెలుగు వెలుగు ప్రతినిధులు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 5: అలనాటి పాటల కోవెల తన సుమధుర గానంతో తెలుగుజాతి స్వర పుత్రుడిగా ఎనలేని సినీ, లలిత పాటలు పాడిన ఘంటసాల తెలుగు భాషకు స్వర వెలుగులు పంచారని వక్తలు అన్నారు. తెలుగువెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో 101వ జయంతి వేడుకలను సీతారాంనగర్ కాలనీ మాతృ సంస్థలో మంగళవారం నిర్వహించారు. ప్రముఖ కథా రచయిత దారం గంగాధర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఘంటసాల కీర్తిని కొనియాడారు. కార్యక్రమంలో అష్టావధాని డాక్టర్ గణపతి అశోకశర్మ, వీపీ చందన్‌రావు, సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్, ఆయాచితం నాగరాజుశర్మ, సముద్రాల రాములు, వేముల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

శివాజీ

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 5: నగరంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండే దేవనల్ శివాజీ(58) అదృశ్యమైనట్లు ఎస్సై రవీందర్ మంగళవారం తెలిపారు. స్థానిక ఆటోనగర్ ప్రాంతంలో ఉండే శివాజీకి మతి స్థిమితంగా లేదని, బయటికి వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. అతడి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఆచూకీ తెలిసినవారు 96035 54904, 87126 59848 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.